క్లుప్తంగా

ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లో నిరసన

నెల్లూరు (టౌన్): కోల్‌కతాలో ట్రెయినీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర నేత మొబీనా ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. నేతలు గౌతమ్, మస్తాన్, సాదిక్, రిత్విక్, మహేష్, రాజేష్, నరేష్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

25న చెస్ జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయి అండర్ – 9 ఓపెన్, బాలికల చెస్ పోటీలను ఈ నెల 25న నిర్వహించి జిల్లా క్రీడాకారులను ఎంపిక చేయనున్నామని చెస్ అసోసియేషన్ నెల్లూరు కార్యదర్శి మస్తాన్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయ్ చెస్ అకాడమీలో నిర్వహించనున్న పోటీలకు ఆసక్తి గల వారు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. విజయనగరంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని, వివరాలకు 98481 47889 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



నెల్లూరు(బృందావనం): మండపాలవీధిలోని గురురాఘవేంద్రస్వామి మఠంలో ఆరాధన మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పురంధరదాసర భజన మండలి ఆధ్వర్యంలో భక్తిగీతాలాపనలు, భజనలను దేవరసు నాగరాజారావు జరిపారు. పల్లకిసేవ, ఊంజల్‌సేవను రాత్రి నిర్వహించారు. నందగిరి జనార్దన్‌రావు, వెంకటగురుచరణ్, కంబాలూరు వ్యాసపీఠ ప్రతిష్టాన మేనేజర్ శ్రీధరాచార్య, వ్యాసరాజ మఠం మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు, సింహపురి మధ్వ సంఘ అధ్యక్షుడు దేవరసు ప్రవీణ్, పత్రి గురురాజా తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని తేవాలి



నరేంద్ర దబోల్కర్ చిత్రపటానికి నివాళులు

నెల్లూరు(అర్బన్): మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని తక్షణమే అమల్లోకి తేవాలని పలువురు డిమాండ్ చేశారు. మహారాష్ట్రలో మూఢ నమ్మకాల నిరోధక చట్టానికి ఆద్యుడైన డాక్టర్ నరేంద్ర దబోల్కర్ వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటానికి మంగళవారం నివాళులర్పించారు. అనంతరం మూఢ నమ్మకాల నిరోధక చట్ట సాధన కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా విశ్రాంత ఉపాధ్యాయుడు పరంధామయ్య, కో కన్వీనర్‌గా శ్రీనివాసులు, నారాయణ, సభ్యులుగా పద్మమ్మ, చంద్రస్, గోపీనాథ్, చలపతిశర్మ, కాలేషాబాషా, ఉదయ్‌భాస్కర్, కృష్ణారెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. జేవీవీ నగర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడులో నూతనంగా నిర్మించిన అయ్యప్ప నాయుడు స్వామి విగ్రహ ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా శతాధిక ప్రతిష్టాపనాచార్యులు బ్రహ్మశ్రీ గాడేపల్లి ప్రశాంత్‌శర్మ వివిధ పూజా కార్యక్రమాలు చేశారు. వివిధ పూజల అనంతరం బుధవారం మధ్యాహ్నం స్వామి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఆహ్లాదమా.. అదెక్కడా..?

- నిర్వహణ లోపంతో అధ్వానంగా సత్యనారాయణపురం పార్కు
- మరమ్మతులకు గురైన వ్యాయామ పరికరాలు
- పచ్చగడ్డి, మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా..
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



కళావిహీనంగా పార్కు



ధ్వంసమైన సిమెంట్ బెంచీ

నెల్లూరు(బారకాసు): ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు నిర్వహణ లోపంతో రోత పుట్టిస్తోంది. చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఆహ్లాదం మాట అటుంచితే, దీని వల్ల కొత్త ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదో డివిజన్ సత్యనారాయణపురంలోని ఎస్వీఆర్ స్కూల్ పక్కన గల పార్కు దుస్థితి ఇదీ.

నాడెంతో ఘనం..

నుడా పరిధిలోని ఈ పార్కును ఎనిమిదేళ్ల క్రితం నగరపాలక సంస్థకు అప్పగించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పార్కును కొంత మేర బాగు చేసి వదిలేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రూ.20 లక్షలను వెచ్చించి ఇక్కడ మొక్కలు నాటడంతో పాటు వాకింగ్ ట్రాక్.. కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు.. విద్యుద్దీపాలు.. ఇలా ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో సందర్శకులతో కళకళలాడేది.

నిర్వహణను గాలికొదిలేశారు..

తాజాగా పార్కు నిర్వహణను కార్పొరేషన్ అధికారులు గాలికొదిలేశారు. పార్కును శుభ్రం చేసే వారు కరువయ్యారు. చెత్త.. తాగి పడేసిన మద్యం బాటిళ్లు.. గ్లాసులు.. ఇలా అధ్వానంగా మారింది. సిమెంట్ బెంచీలు విరిగిపోవడం.. మొక్కలు, పచ్చిగడ్డి ఎండిపోయి పార్కు కళావిహీనంగా మారింది. దీంతో ఇక్కడికి వచ్చే వారు తగ్గుముఖం పట్టారు.

చీకటి పడితే అంతే..

ఇక్కడ వాచ్‌మెన్ సైతం లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కొందరు మార్చుకున్నారు. మద్యం తాగుతూ.. గంజాయి సేవిస్తూ.. అల్లరి చేస్తూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీరి ఆగడాలపై నవాబుపేట పోలీసులకు స్థానికులు గతంలో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు హడావుడి చేస్తున్నారే తప్ప, వారిపై చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు వీరి కారణంగా పార్కుకు వెళ్లాలంటేనే మహిళలు హడలిపోవాల్సిన పరిస్థితి. ఈ ఆగడాలకు అడ్డుకట్ట వేసి పార్కుకు పూర్వవైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా మారింది



ఈ పార్కు గతంలో ఎంతో సుందరంగా ఉండేది. వాకింగ్ నిమిత్తం రోజూ ఎంతో మంది వచ్చేవారు. అయితే ప్రస్తుతం దీన్ని పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. ఆకతాయిల ఆగడాలతో ఇక్కడికి రావాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– వీరాస్వామి, జాకీర్‌హుస్సేన్‌నగర్

వ్యాయామ పరికరాలను బాగు చేయించాలి



పార్కులో వ్యాయామ పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. ఆలనాపాలనా కరువవడంతో కళావిహీనంగా మారింది. మొక్కలు ఎండిపోయి దారుణంగా తయారైంది. కార్పొరేషన్ అధికారులు స్పందించి పార్కును బాగుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఏటూరి అశోక్, సత్యనారాయణపురం

పన్ను వసూళ్లు వేగవంతం



జాఫర్‌సాహెబ్ కాలువను పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగరంలో పన్నుల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని మైపాడు గేట్ సెంటర్, జాఫర్‌సాహెబ్ కాలువ, కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్‌నగర్, సుబేదారుపేట, ఏబీఎం చర్చి, గాంధీబొమ్మ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. జీవీఆర్ కాంప్లెక్స్‌లోని దుకాణదారులతో మాట్లాడి పన్నుల చెల్లింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. తొలుత జాఫర్ సాహెబ్ కెనాల్ ట్యాంక్‌బండ్‌ను పరిశీలించారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సత్యనారాయణపురం, కేపీఆర్ కల్యాణ మండప ప్రాంతాల్లోని పార్కుల్లో జంగిల్ క్లియరెన్స్‌ను చేపట్టి సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ శాఖ డీఈఈ అనిల్‌కుమార్, రెవెన్యూ అధికారులు సమద్, కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న వాణి

నెల్లూరు (టౌన్): అన్నమయ్య సర్కిల్లోని తేజస్విని గ్రాండ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును సింహపురి స్వగతి మహిళాభ్యుదయ సంఘం, సంగ్రామ్ సంస్థ బెంగళూరు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ న్యాయమూర్తి వాణి, డీఎస్పీ సాయినాథ్ హాజరయ్యారు. సెక్స్ వర్కర్లు, టీజీఎస్, ఎమ్మెస్సెమ్‌లకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, మార్గదర్శకాలు, హక్కులపై చర్చించారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రాజెక్ట్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల అందజేత



నెల్లూరు(బృందావనం): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేసి అన్నదానాన్ని మంగళవారం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు భక్తులు విశేషంగా హాజరయ్యారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రెడ్‌క్రాస్‌లో కాంగ్రెస్ నేతల రక్తదానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఇందిరాభవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని రెడ్‌క్రాస్‌లో రక్తదానాన్ని పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేతలు హుస్సేన్‌బాషా, రెహమాన్, సురేష్‌బాబు, మీరామొహిద్దీన్, హనీఫ్, మల్లికార్జునరెడ్డి, అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ ఏర్పాటు

నెల్లూరు (టౌన్): నగరంలోని కేఎన్నార్ స్కూల్లో సన్‌షేడ్ కూలి విద్యార్థి గురుమహేంద్ర మృతి చెందిన ఘటనపై జిల్లా అధికారులు ఎట్టకేలకు స్పందించారు. పాఠశాలలో జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలించేందుకు గానూ త్రిసభ్య కమిటీని కలెక్టర్ ఆనంద్ నియమించారు. ఇందులో డీఈఓ, అడిషనల్ కమిషనర్, సమగ్రశిక్ష ఇంజినీరింగ్ అధికారిని సభ్యులుగా ఏర్పాటు చేశారు. పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నాణ్యతను పరిశీలించి కలెక్టర్‌కు నివేదికను అందజేయనున్నారు. నివేదిక అందాక వాస్తవాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు చేపట్టనున్నారు.

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం

నెల్లూరు(అర్బన్): దోమలను నిర్మూలించడం ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా లాంటి వ్యాధులను దూరం చేయొచ్చని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని జిల్లా, వైద్యశాఖ కార్యాలయంలో డాక్టర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి మంగళవారం నివాళులర్పించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కలిగిస్తూ పీఎమ్మార్ హైస్కూల్ నుంచి సంతపేట వరకు ర్యాలీని నిర్వహించారు. జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, కపాడిపాళెం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి కల్యాణ్, పీఎమ్మార్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు ఖాదర్‌బాషా, సహాయ మలేరియాధికారి నాగార్జున్‌రావు, పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్యామ్‌సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పంటపాళేనికి బస్సు

నెల్లూరు సిటీ: వీఆర్సీ సెంటర్ నుంచి పంటపాళెం వరకు ఆర్టీసీ బస్సును బుధవారం నుంచి నడపనున్నామని నెల్లూరు రెండో డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. వీఆర్సీ సెంటర్ నుంచి నారాయణ మెడికల్ కళాశాల, కాకుపల్లి, బ్రహ్మదేవి, బండ్లపాళెం, దువ్వూరువారిపాళెం, పోలంరాజుగుంట మీదుగా పంటపాళెం వరకు బస్సును నడపనున్నామని చెప్పారు. వీఆర్సీ సెంటర్ నుంచి ఉదయం ఎనిమిది.. మధ్యాహ్నం 12.45, సాయంత్రం నాలుగు గంటలకు.. పంటపాళెం నుంచి ఉదయం 7.30, మధ్యాహ్నం 2.30, సాయంత్రం 5.30కు బయల్దేరనుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

నెల్లూరు (టౌన్): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏఎమ్వీఐ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని నలంద స్కూల్ ఆధ్వర్యంలో ర్యాలీని మంగళవారం నిర్వహించారు. మినీబైపాస్‌లోని పూలే విగ్రహం వరకు ర్యాలీ సాగింది. ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, హెడ్‌మాస్టర్ హేమలత, ఉపాధ్యాయులు అక్బర్, రాజేష్, సురేష్ పాల్గొన్నారు.

సీసీ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ: నగరంలోని 20వ డివిజన్లో గల వనంతోపు సెంటర్‌లో రూ.33 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ పనులకు శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం చేపట్టారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ చేజర్ల మహేష్, క్లస్టర్ ఇన్‌చార్జి సాయిబాబా, ఖాదర్‌బాషా, పోతురాజు రవి, అన్నంగి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

- నగర సుందరీకరణలో భాగంగా హరనాథపురంలో సూర్య నమస్కారాల విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపనను నిర్వహించారు.

పోరాటాల్లో సీపీఐది ప్రత్యేక పాత్ర



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశ, రాష్ట్ర రాజకీయాల్లో పోరాటాల్లో సీపీఐ ప్రత్యేక పాత్ర పోషిస్తుందని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, హరినాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్, రమణయ్య, మధు, అరిగెల సాయి, సురేష్, షానవాజ్, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీలు



నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలను ఏడీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ, లెప్రసీ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ మంగళవారం చేపట్టారు. బీసీజీ వ్యాక్సినేషన్, టీబీ రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. సూపర్‌వైజర్ వేణుగోపాల్, టీబీహెచ్‌బీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కోల్‌కతాలోని ఆర్జీ కర్ హాస్పిటల్లో హత్యాచారానికి గురైన ట్రెయినీ డాక్టర్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. నగరంలోని బృందావనంలో డాక్టర్ యశోధర ఆధ్వర్యంలో వైద్యులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. వైద్యులు శ్రీనివాసరెడ్డి, బలరామయ్యనాయుడు, శ్యామలమ్మ, లలిత, శిరీష, రమాదేవి, జయప్రకాష్, విద్యాధరి, పూర్ణిమ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించండి



సమావేశానికి హాజరైన బీఎల్వోలు, సిబ్బంది



మాట్లాడుతున్న సూర్యతేజ

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగర నియోజకవర్గంలో వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన యువతను గుర్తించి, వారందరికీ ఓటు హక్కు కల్పించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్‌పై ఎన్నికల విభాగాధికారులు, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ ద్వారా అందుకున్న అన్ని దరఖాస్తులను పారదర్శకంగా విచారించి అర్హులను గుర్తించాలని సూచించారు. జాబితాలను సంబంధిత ఉన్నతాధికారులకు పంపాలని చెప్పారు. బీఎల్వోలు తమ పరిధిలో ఇంటింటి సర్వేను నిర్వహించి వివరాల పరిశీలనకు గృహాలను సందర్శించి ఓటర్లతో ప్రత్యక్షంగా మాట్లాడాలని కోరారు. ఏఈఆర్వోలు దేవీకుమారి, షఫీమాలిక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించండి

నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. పొదలకూరురోడ్డు, ఎఫ్‌సీఐ గోదాములు, వేపదొరువు, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఖాళీ స్థలాలను శుభ్రపర్చేలా యజమానులకు నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం అల్లీపురంలోని డంపింగ్ యార్డును తనిఖీ చేశారు. యార్డు నిర్వహణ, రీసైక్లింగ్ విధానం తదితరాలను పరిశీలించారు. వెంకటేశ్వరపురంలోని పశువుల సంత ప్రాంతాన్ని పరిశీలించి, పారిశుధ్య నిర్వహణ పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. ఈఈ సంజయ్, డీఈ సురేష్, సిటీప్లానర్ దేవీకుమారి, సర్వేయర్ సోమేశ్వరరావు, ఉద్యానశాఖ ఏడీ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో మురుగు తొలగింపు



నెల్లూరు(బారకాసు): నగరంలోని 18వ డివిజన్లో గల హరనాథపురంలో ఉన్న కాలువల్లో మురుగును నగరపాలక సంస్థ అధికారులు మంగళవారం తొలగించారు. మురుగు పేరుకుపోవడంతో స్థానికులు పడుతున్న అవస్థలపై 'పడకేసిన పారిశుధ్యం' అనే శీర్షికన సాక్షిలో సోమవారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. కాలువలో మురుగును తొలగించాలని ఎంహెచ్‌ఓ చైతన్య ఆదేశించారు. దీంతో కార్మికులతో శుభ్రం చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోతుల పట్టివేత



సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్ల పరిధిలో గల వెంకటేశ్వరపురం, గాంధీగిరిజనకాలనీ, ఇస్లాంపేట, జనార్దన్‌రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. గాంధీగిరిజన కాలనీలో ఓ చిన్నారిపై ఇటీవల దాడి చేసిన ఘటనపై 'కోతుల బెడద' అనే శీర్షికన సాక్షిలో కథనం మంగళవారం ప్రచురితమైంది. ఈ తరుణంలో సిబ్బందిని వార్డు శానిటరీ సెక్రటరీ లీలావతి ఏర్పాటు చేశారు. రెండు బోన్లను ఏర్పాటు చేసి కోతులను పట్టి దూర ప్రాంతాలకు తరలించారు.